క్లుప్తంగా

వాకింగ్ ట్రాక్ పనులకు మరో వారం రోజులు



నిర్మాణ దశలో వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని వాకింగ్ ట్రాక్

మురళీనగర్ : స్థానిక వైశాఖి స్పోర్ట్స్ పార్కులో మట్టితో నిర్మిస్తున్న వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి కావడానికి మరో వారం రోజుల సమయం పడుతుందని పార్కు అధ్యక్షుడు సనపల వర ప్రసాద్, సంయుక్త కార్యదర్శి రఘురామ్ ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ పనులు మంగళవారం నాటికి పూర్తి చేసి బుధవారం నుంచి ట్రాక్‌ను వాకర్స్, సందర్శకులకు అందుబాటులోకి తేవాలని భావించారు. అయితే ట్రాక్‌ను పటిష్ఠంగా నిర్మిస్తుండడంతో పనులు కొద్దిగా ఆలస్యం అయ్యాయని, ఈ నేపథ్యంలో మరో వారం రోజుల పాటు ట్రాక్‌ను మూసి వేస్తున్నట్లు తెలిపారు.

తాటిచెట్లపాలెంలో అన్నదానం



అన్నదానంలో పాల్గొన్న పలిశెట్టి అప్పన్న, బీజేపీ నాయకులు

తాటిచెట్లపాలెం : జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల సుందర అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మంగళవారం భారీ అన్నదానం నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పలిశెట్టి అప్పన్న చేతుల మీదుగా అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో నార్త్ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు కుటుంబ సభ్యులు పెన్మత్స శ్యామలదీపిక, సునీల్‌కుమార్, పృథ్వీరాజ్, బీజేపీ నార్త్ ఇన్‌చార్జి సురేష్‌బాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆళ్ల నరసింగరావు, కొప్పిశెట్టి శంకర్రావు, యల్లపురామ అప్పారావు, కొప్పిశెట్టి సిమ్మారావు పాల్గొన్నారు.

కుంచమాంబకు మొక్కు చెల్లింపు



అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న బీజేపీ, జనసేన నాయకులు

మురళీనగర్ : ఉత్తర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన విష్ణుకుమార్ రాజు తరఫున ఆ పార్టీ నాయకులు మురళీనగర్, మాధవధార ఇలవేల్పు కుంచమాంబ అమ్మవారికి మంగళవారం మొక్కు చెల్లించుకున్నారు. ఈ మేరకు ముఖ్య అతిథిగా సునీల్ అగర్వాల్, శ్యామల దీపిక దంపతులు విష్ణుకుమార్ రాజు తరఫున అమ్మవారికి 101 కొబ్బరి కాయలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన వార్డు అధ్యక్షుడు ఎస్.సాగర్, బీజేపీ మండల అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, సీనియర్ నాయకులు కేవీ రమణ, ఆర్.విజయ్‌చందు, శశిభూషణరావు, ఐఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



చాట్ దుకాణంలో ఫోన్ పే చేస్తున్న వినియోగదారుడు



క్యూఆర్ కోడ్‌తో రైల్వేట్రాక్ రహదారిలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి



టిఫిన్ దుకాణంలో చెల్లింపులు చేస్తున్న వినియోగదారుడు

నగదు వద్దు.. ఆన్‌లైనే ముద్దు

- నో క్యాష్.. డిజిటల్ పేమెంట్ మాత్రమే అంటున్న వ్యాపారులు
- చిల్లర ఇబ్బందులకు చెక్

బయటికి వెళ్తున్నారా? చేతిలో నగదు లేకపోయినా ఫర్వాలేదు.. అకౌంట్‌లో నగదు, చేతిలో స్మార్ట్‌ఫోన్.. దానికి ఛార్జింగ్ ఉంటే చాలు.. కావాల్సిన వస్తువులు కొనుగోలు చేయొచ్చు.. నచ్చినవన్నీ తినొచ్చు. గతంలో మాల్స్, పెద్ద వ్యాపార సంస్థలకే పరిమితమైన డిజిటల్ పేమెంట్స్ రానురాను చిరువ్యాపారుల చెంతకు సైతం చేరాయి. నగదు లావాదేవీలు తగ్గుతుండడంతో నగర మార్కెట్ల నుంచి గల్లీ మార్కెట్ల వరకు ఎక్కడ చూసినా ఆన్‌లైన్ చెల్లింపులే కనిపిస్తున్నాయి.

కంచరపాలెం : పెద్ద నోట్ల రద్దు తర్వాత ఆర్థిక లావాదేవీల్లో ఇబ్బందులను అధిగమించే నిమిత్తం డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా అప్పట్లో పెద్దగా ప్రజలు ఆసక్తి చూపించలేదు. రూ.500, రూ.2000 నోట్లు మార్కెట్లలో చెలామణి కావడంతో చిల్లర సమస్య ఉత్పన్నమైంది. నాటి నుంచి మాల్స్, పెద్ద వ్యాపార సంస్థల్లో మాత్రమే పేమెంట్ యాప్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులతో చెల్లింపులు జరిగేవి. నగదు వేరే వారి ఖాతాల్లోకి వెళ్లిపోతుందన్న అపోహలు, ఆర్థిక మోసాలు జరుగుతాయన్న ఆందోళనతో గ్రామాల్లో వీటి జాడ పెద్దగా కనిపించేది కాదు. నగరాల్లో మాత్రం కొద్దిగా కనిపించేది. కోవిడ్ అనంతర పరిణామాలతో నగదు రహిత లావాదేవీల్లో గణనీయమైన మార్పులు కనిపించాయి.

పెరిగిన ఆన్‌లైన్ లావాదేవీలు..

ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, అమెజాన్ పే, భారత్ పే వంటి యాప్‌లతో అన్నిచోట్లా ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. కిరాణా, ఫ్యాన్సీ, మందులు, పెట్రోల్ బంకులు, సెలూన్ షాపులు, హోటళ్లు, మిఠాయి దుకాణాలు, ఇతర నిత్యావసర వస్తువుల దుకాణాలతో పాటు మొబైల్, డీటీహెచ్ రీచార్జిలు, విద్యుత్, గ్యాస్ బిల్లులు, ఇతర ఆర్థిక లావాదేవీలు చాలా వరకు ఈ యాప్ ద్వారానే జరుగుతున్నాయి. పేమెంట్ యాప్‌లు వినియోగిస్తున్న వారిలో యువత ముందు వరుసలో ఉంటోందని



కంచరపాలెం కూడలిలో దుస్తులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఆయా సంస్థల ప్రతినిధులు అంటున్నారు.

స్పీకర్ బాక్స్‌లతో మోసాలకు చెక్..

ఆన్‌లైన్ చెల్లింపులో ఉపయోగాలతో పాటు ఆదమరిస్తే మోసాలకు అంతే ఆస్కారం ఉంటుందని నిపుణులు అంటున్నారు. వీటిపై అవగాహన లేని వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని ఆన్‌లైన్ మాయగాళ్లు మోసాలకు పాల్పడుతుంటారు. సరకులు కొనుగోలు చేసిన తర్వాత వేరే వారికి నగదు బదిలీ చేస్తారు. సెల్‌ఫోన్ స్క్రీన్‌పై వచ్చిన ట్రాన్సాక్షన్ సక్సెస్‌ఫుల్ మెసేజ్‌ను దుకాణదారుడికే అమౌంట్ పే చేసినట్లు చూపించి అక్కడి నుంచి జారుకుంటారు. అయితే మార్కెట్లోకి వచ్చిన క్యూఆర్ కోడ్ స్పీకర్ బాక్స్‌లు ఇటువంటి అక్రమాలకు చెక్ పెడుతున్నాయి. ఆన్‌లైన్ చెల్లింపు జరగ్గానే ఎంత మొత్తం దుకాణదారు ఖాతాకు జమ అయిందనే విషయం స్పీకర్‌లో బయటికి వాయిస్ రూపంలో వినిపిస్తుంది. దీంతో డిజిటల్ మోసాలకు అడ్డుకట్ట పడిందని వ్యాపారులు అంటున్నారు.

డిజిటల్ బ్యాంకింగ్‌కు ప్రాధాన్యం..

బ్యాంకుల్లో కూడా డిజిటల్ బ్యాంకింగ్‌కు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో నగదు లావాదేవీలు చాలా వరకు తగ్గుతున్నాయి. వినియోగదారులు అధికంగా నగదు రహిత ట్రాన్సాక్షన్లు చేస్తూ ఇంటి వద్ద నుంచే అన్ని రకాల సేవలు పొందుతున్నారు. దీని వల్ల బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల సంఖ్య తగ్గిందని బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులు అంటున్నారు. మరోపక్క రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిటల్ పేమెంట్స్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది.

ఎంతో ప్రయోజన కరం..

టీ స్టాళ్లు, కాకా హోటళ్లు, తోపుడుబళ్లు, సైకిళ్లపై తిరుగుతూ ఫాస్ట్‌ఫుడ్స్, కూరగాయలు, పండ్లు వంటివి అమ్మే వ్యాపారులకు ఈ ఆన్‌లైన్ చెల్లింపులు ప్రయోజనకరంగా మారాయి. ప్రధానంగా చిల్లర సమస్యతో వీరికి బేరాలు పోతుంటాయి. డిజిటల్ పేమెంట్స్ పుణ్యమా అని చిల్లర సమస్య తీరుతుండటంతో చిరువ్యాపారులు సైతం వీటివైపు మొగ్గు చూపుతున్నారు. పేమెంట్ యాప్‌లకు సంబంధించిన క్యూఆర్ కోడ్లను ఆయా సంస్థల ఏజెంట్లు క్షణాల్లో అందజేస్తున్నారు. ఇప్పుడు ఏ దుకాణం వద్ద చూసినా క్యూఆర్ కోడ్ స్టిక్కర్ల బోర్డులు దర్శనమిస్తున్నాయి. గతంతో పోలిస్తే చాలా వరకు వినియోగదారులు ఆన్‌లైన్ పేమెంట్ చేసేందుకే ఆసక్తి చూపిస్తున్నారని, వీటివల్ల చిల్లర సమస్య ఉండటం లేదని వ్యాపారులు అంటున్నారు.

యూపీఐ పేమెంట్లతో జాగ్రత!

యూపీఐ పేమెంట్స్ చేసేటప్పుడు వినియోగదారులు కాస్త జాగ్రత్త వహించి దిగువ అంశాలు గుర్తుంచుకోవాలి.

- నగదు పంపేందుకు మాత్రమే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి. రిసీవ్‌కు స్కాన్ అవసరం లేదు.
- యూపీఐ పిన్ ఎవరికీ చెప్పొద్దు. మీరు పేమెంట్ చేసేటప్పుడు మాత్రమే పిన్ ఎంటర్ చేయాలి.
- కొత్త నంబర్లు క్యూఆర్ కోడ్‌లకు నగదు పంపే ముందు అక్కడ వచ్చిన పేరు వారిదేనా కాదా చెక్ చేయాలి.
- అపరిచితుల నుంచి ఆఫర్ల పేరిట వచ్చే లింక్స్ క్లిక్ చేయొద్దు.
- ఫోన్లు హ్యాక్ అయ్యే ఛాన్స్ ఉన్నందున వాటిలో బ్యాంకింగ్ వివరాలు సేవ్ చేయొద్దు.

చిల్లర సమస్య లేదు..



గతంలో చిల్లర సమస్య అధికంగా ఉండేది. చిల్లర కోసం బేరాలు కూడా వదులుకునే వాళ్లం. ఫోన్ పే, గూగుల్ పే, క్యూఆర్ కోడ్‌తో చిల్లర సమస్య లేకుండా వ్యాపారాలు సాఫీగా చేస్తున్నాం. సమయం కూడా ఆదా అవుతోంది.

– బుద్దాల శ్రీను, కూరగాయల వ్యాపారి, కంచరపాలెం

కొత్తలో భయపడే వాళ్లం..



క్యూఆర్ కోడ్‌తో కస్టమర్ స్కానింగ్ చేసేటప్పుడు డబ్బులు ఖాతాలో పడ్డాయో లేదో అని భయపడే వాళ్లం. ఇప్పుడు ఆ భయం పూర్తిగా పోయింది. బ్యాంకు వాళ్లు అవగాహన కల్పించడంతో ఆందోళ తొలగింది. వ్యాపారాలు బాగా సాగుతున్నాయి.

– విజినిగిరి పైడిరాజు, నాయీబ్రాహ్మణుడు, కంచరపాలెం,

చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నేడు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ సునీత తదితరులు

సీతంపేట : అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విశాఖ ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్, ఆంధ్రప్రదేశ్ ప్రో చైల్డ్ గ్రూప్ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.సునీత చేతుల మీదుగా మంగళవారం ప్రచార పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు, కార్మిక శాఖ అధికారులతో కలిసి ఈ నెల మొత్తం చైల్డ్ లేబర్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12న ముఖ్య విభాగాల అధికారులు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి బాలకార్మికులను గుర్తిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య స్రవంతి డైరెక్టర్ ఎం.మాలిని, విశాఖ ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ ప్రతినిధి హరి, ఆదర్శ ఇంటి పనివారల సంఘం ప్రతినిధులు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్లు ఎ.రాజు, ఆర్.రమాదేవి, ఎస్.మోహనలక్ష్మి, ఏసీఎల్‌లు మనోజ్, నరేష్, పద్మావతి పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



మృతుడు నంది కన్ని

సీతమ్మధార : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్తుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. తాటిచెట్లపాలెం వాటర్ ట్యాంక్ సమీపంలోని ప్రశాంతినగర్‌లో కలకత్తాకు చెందిన నంది కన్ని (37) నివాసం ఉంటున్నాడు. అతను కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. 2017లో జీవనోపాధి కోసం విశాఖ వచ్చి అన్నావదినలతో ఉంటున్నాడు. గత నెలలో తల్లి చనిపోవడంతో పాటు తనకు పెళ్లి కాలేదని మనస్తాపంతో మంగళవారం ఉదయం మేడపై ఉన్న మెట్లకు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఘటనపై కుటుంబ సభ్యులు ఫోర్తుటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలికి చేరుకున్న హెచ్‌సీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ చాటిన మురళీనగర్ విద్యార్థులు..



జామి మౌనిక



షణ్ముఖ్

మురళీనగర్ : నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న నలుగురు విద్యార్థులు గత ఏడాది డిసెంబరు 3న జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి జాతీయ స్థాయి ఉపకార వేతనానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం బి.హేమలత తెలిపారు. ఈ మేరకు జామి మౌనిక, వై.షణ్ముఖ్, ఎ.ద్రాక్షణ్య, టి.దివేన ఎంపికయ్యారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్ పూర్తయ్యే వరకు నాలుగు సంవత్సరాలు ఏడాదికి రూ.12,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనం అందిస్తుంది. ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం హేమలత, ఇతర ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.



ద్రాక్షణ్య



దివేన



జగదీష్

స్కాలర్‌షిప్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

సీతంపేట : స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్లో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక య్యారు. 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గత డిసెంబర్‌లో నిర్వహించిన ఎన్ఎంఎస్ పరీక్షకు 20 మంది హాజరు కాగా ఇ.జగదీష్, చరణ్‌కుమార్ స్కాలర్‌షిప్‌కు ఎంపిక అయ్యారని స్కూల్ హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు 9, 10, ఇంటర్ మీడియట్ రెండు సంవత్సరాలు ఏడాదికి రూ.12 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందని తెలిపారు.

సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు



క్షీరాభిషేక సేవలందుకుంటున్న సుబ్రహ్మణ్య స్వామి

కంచరపాలెం : ఊర్వశి జంక్షన్‌లోని రవీంద్రనగర్‌లో గల సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో జ్యేష్ఠ మాస శుద్ధ పంచమి మంగళవారాన్ని పురస్కరించుకుని శరవణ ట్రస్ట్ చైర్మన్, ఆలయ ధర్మకర్త దేవాల రాజు ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య స్వామికి స్కంధ పూజలు నిర్వహించారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామం, విభూది, పుష్పాలతో అర్చనలు చేశారు. ఈ పూజలను ఆలయ అర్చకులు రామకృష్ణశర్మ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



దీక్షా శిబిరంలో నాయకులు, కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, ఐరన్ ఓర్ గనులు కేటాయించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పరంధామయ్య, విళ్ల రామ్మోహన్‌కుమార్ కోరారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో 1216వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. ఉక్కు శాఖ సహాయ మంత్రి శ్రీనివాస వర్మ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించేందుకు బాధ్యత తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి పట్టుకొమ్మ వంటి విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించేలా ప్రధానమంత్రిపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. అలాగే వర్కింగ్ క్యాపిటల్ అందించి ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కించాలన్నారు. గత ఏడాదిన్నరగా యాజమాన్యం, ప్రభుత్వ చర్యల వల్ల ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి నుంచి ఉపశమనం పొందడానికి చేయూత అందించాలని కోరారు. కార్యక్రమంలో బ్లాస్ట్ ఫర్నేస్ కార్మికులు, నాయకులు శ్రీనివాసరాజు, సాయి నాగబాబు, వేణుగోపాలరావు, జోషి, మధుసూదనరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

షరతులతోనే మద్దతు కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విదసం రాష్ట్ర కన్వీనర్ వెంకటరావు

ఉక్కునగరం: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చే దిశగా మాత్రమే ఎన్డీయేకు టీడీపీ మద్దతు కొనసాగించాలని విదసం నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం విదసం రాష్ట్ర సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ, స్టీల్‌ప్లాంట్ రక్షణ, ప్రత్యేక హోదా సాధనే ప్రధాన షరతులుగా ఉండాలన్నారు. ఎన్డీయేకు టీడీపీ మద్దతు లౌకికవాదానికి ముప్పు అయినప్పటికీ బీజేపీ నుంచి ప్రమాదం జరగకుండా ఉండేలా చంద్రబాబు మద్దతు కొనసాగించాలన్నారు. ఐక్య వేదిక కన్వీనర్ బూసి వెంకటరావు, ఎస్.ఆర్.వేమన, వివిధ జిల్లాల కన్వీనర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ జాతర



ఆకట్టుకున్న చంద్రముఖి డ్యాన్స్

సీతంపేట : స్థానిక గ్రామ దేవత పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగ కన్నుల పండువగా జరిగింది. మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సీతంపేట, గొల్లవీధి, నాయుడువీధి, కనకమ్మవీధి, శ్రీనివాసవీధి తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పసుపు, కుంకుమ, చీర, జాకెట్టు, గాజులు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. సాయంత్రం నాయుడు వీధిలోని పుట్టబంగారం ఘటాలతో అమ్మవారి అనుపు ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు అమ్మవారికి హారతులు, టెంకాయలతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నేల డ్యాన్సులు, తప్పెట గుళ్ళు, కోలాటం, సేవ గరిడీ, బళ్ల వేషాలు, చంద్రముఖి డ్యాన్సు, రాధాకృష్ణుల బృందావనం డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. బాణసంచా, విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సీతంపేట కూడలిలో ఏర్పాటు చేసిన డ్యాన్స్ బేబీ డ్యాన్స్ ప్రేక్షకులను అలరించింది. ఉత్సవ కమిటీ చైర్మన్ ఇసరపు రాజేష్‌బాబు శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అలరించిన బళ్ల వేషాలు



సేవ గరిడీ



దుర్గాదేవి నృత్యం

న్యాయ సేవాధికార సంస్థతో సత్వర న్యాయం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ



సదస్సులో మాట్లాడుతున్న వెంకట శేషమ్మ

పెందుర్తి: న్యాయ సేవాధికార సంస్థ ద్వారా నిరుపేదలకు సత్వర న్యాయం అందుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. మండలంలోని గొరపల్లిలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.3 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న మహిళలు, పిల్లలు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు న్యాయ సహాయం అవసరం అయితే న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. ప్రతీ గ్రామాన్ని వ్యాజ్యాలు లేని గ్రామాలుగా మార్చడానికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి.రవికుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.ఎస్ రంగలక్ష్మి, ఆర్ఐ సాయికిరణ్, సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి రాజు, సర్పంచ్ గొరపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దాసరి పైడితల్లమ్మ పండగ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీ, దాసరి మెట్ట ప్రాంతాల్లో కొలువైన దాసరి పైడితల్లమ్మ పండగ మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారు కొలువైన ప్రాంతాలకు భక్తులు వేకువ జామునే చేరుకుని నూతన వస్త్రాలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.